క్లుప్తంగా

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలి



మామిడిపల్లిలో చీపురు పట్టి చెత్త ఊడ్చుతున్న డీఎల్‌డీవో మంజులవాణి

దేవరాపల్లి : పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ తగ్గించాలని డీఎల్‌డీవో, మండల ప్రత్యేక అధికారి ఎస్.మంజులవాణి సూచించారు. మామిడిపల్లి గ్రామంలో శనివారం చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ఆమె పర్యవేక్షించారు. ఇంటింటా పర్యటించి గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని సూచించారు. ఎంపీడీవో సువర్ణరాజుతో కలిసి డీఎల్‌డీవో చీపురు పట్టి వీధుల్లో చెత్త ఊడ్చారు.

జల సంరక్షణ అందరి బాధ్యత



జల దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మాకవరపాలెం : జల సంరక్షణ అందరి బాధ్యత అని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం కె.రాము కోరారు. ఈ పాఠశాలలో శనివారం జల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో 97 శాతం నీరు సముద్రాల్లో ఉందన్నారు. కేవలం మూడు శాతం నీరు మాత్రమే తాగడానికి, వ్యవసాయానికి వినియోగిస్తున్నట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో జల వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. నీటిని అవసరం మేరకే వాడాలని, వృధా చేయకూడదన్నారు. నీటిని పొదుపు చేయాలంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లోవరాజు, సంతోషి పాల్గొన్నారు.

26న మెగా జాబ్ మేళా

నర్సీపట్నం : ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ వారి సౌజన్యంతో నర్సీపట్నం రిషీ కాలేజీలో ఈ నెల 26న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని కళాశాల కరస్పాండెంట్ కె.సతీష్ తెలిపారు. ఈ జాబ్ మేళాలో 18 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలిపారు. హెటెరో, డక్కన్, అపోలో, ఫోక్స్‌కాన్, అరబిందో తదితర కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు.

రూ.12.50 లక్షలకు ఆశీలు వేలం ఖరారు

దేవరాపల్లి : దేవరాపల్లి పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ కాలేజీ వద్ద గల రోజువారి మార్కెట్‌లో 2025-2026 సంవత్సరానికి ఆశీలు వసూలుకు నిర్వహించిన బహిరం వేలం పాటలో గ్రామానికి చెందిన బండారు అప్పలనాయుడు రూ.12.50 లక్షలకు దక్కించుకున్నాడు. సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ అధ్యక్షతన స్థానిక పంచాయతీ కార్యదర్శి కె.సుధాకర్‌బాబు పర్యవేక్షణలో శనివారం బహిరంగ వేలంపాట ప్రక్రియ జరిగింది. ఇదే మార్కెట్‌కు గతంలో నిర్వహించిన వేలం పాట రూ. 7.01 లక్షలు పలికింది. ఇదిలా ఉండగా పంచాయితీ ఆఫీస్ వద్ద గల రోజువారీ మార్కెట్‌లో ఆశీలు వసూలుకు నిర్వహించిన బహిరంగ వేలం పాటలో గ్రామానికి చెందిన బండారు అర్జున రూ.5.50 లక్షలకు దక్కించుకున్నాడు. గతంలో ఈ వేలం పాట రూ.4.51 లక్షలు ఖరారు అయింది. పంచాయితీలో పారిశుద్ధ్య పనులకు లేబర్‌ను సమకూర్చేందుకు దారపురెడ్డి రామునాయుడు ఒక్కరే నెలకు రూ.1.80 లక్షల చొప్పున సీల్ టెండర్ వేయగా ఖరారు చేశారు. రక్షిత మంచినీటి పథకాల నిర్వహణకు తోట ప్రసాదరావు నెలకు రూ. 9వేలు చొప్పున సీల్ టెండర్ వేయగా ఖరారు చేశారు. విద్యుత్ దీపాల మరమ్మతుకు షేక్ అప్పాసాహెబ్ నెలకు రూ.10,500 చొప్పున సీల్ టెండర్ ఛేయగా ఖరారు చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

చోడవరం : ప్రకృతి వ్యవసాయంపై రైతులు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రకృతి వ్యవసాయం అధికారి సిహెచ్.లచ్చన్న సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో 2025-26 సంవత్సరానికి సంబంధించి ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ తయారు చేసే అంశంపై సంబంధించి వ్యవసాయాధికారులు, సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో రైతుల వివరాలను, వేసే పంటలు, ప్రస్తుతం సాగులో ఉన్న పంటల పరిస్థితిపై ఈ సందర్భంగా సమీక్షించారు. నవధాన్యాలు పండించే విధానంలో 30 రకాల విత్తనాలు ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసేందుకు అందుబాటులో ఉన్నాయన్నారు.

ముగిసిన శిక్షణ

కె.కోటపాడు : కె.కోటపాడు ఐసీడీఎస్ కార్యాలయంలో మూడు రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న పోషన్ భీ..పడాయి భీ కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమాలు శనివారంతో ముగిసాయి. ఈ శిక్షణ కార్యక్రమంలో శనివారం పాల్గొన్న పీవో మంగతాయారు నవ చేతన, ఆధార్ శిల కార్యక్రమాల నిర్వహణపై వివరించారు. కార్యక్రమంలో 0-3 ఏళ్లలోపు చిన్నారులకు వారి తల్లులు పిల్లల పెంపకం, సంరక్షణలో పాటించాల్సిన జాగ్రత్తలను తెలిపారు.



శివాలయం సమీపంలో లీకవుతున్న నీరు



గ్రంథాలయం సమీపంలో పైపులైన్ లీకై రోడ్డుపైనే వృథాగా పారుతున్న నీరు

- పైపులైను లీకేజీపై నిర్లక్ష్యం
- కాలువలు కడుతున్న జలం
- తాగునీటికి ఫ్లోరైడ్ గ్రామాలు సతమతం

అసలే వేసవి కాలం...
ఏమిటీ అలసత్వం!

రోలుగుంట : మండలంలో ఫ్లోరైడు గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే రోలుగుంట గ్రామంలో గల శివాలయం సమీపంలో ఉన్న పైపులైను లీకై ఈ మార్గంలో గ్రంథాలయం రోడ్డు వరకూ ఏకధాటిగా తాగునీరు వృథాగా పోతుంది. సమస్యపై అధికారులకు పట్టడం లేదు. దీంతో ఆ పైపులైను ద్వారా సరఫరా అయ్యే గ్రామస్తులు తాగునీటి కోసం ఇక్కట్లు పడుతున్నారు. సమస్య వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో గల కె.నాయుడుపాలెం, నిండుగొండ, ఎన్.కొత్తూరు, రోలుగుంటతో పాటు మరికొన్ని గ్రామాలను ఫ్లోరైడు గ్రామాలుగా గుర్తించి జానకీరాంపురం ఏటి నుంచి శుద్ధి చేసిన తాగునీటిని పంపింగు సిస్టం ద్వారా సరఫరా చేస్తున్నారు. పై గ్రామాలకు మండల కేంద్రం రోలుగుంట మీదుగా పైపులైను ఏర్పాటు చేసి గుర్తించిన ఫ్లోరైడు గ్రామాలకు తాగునీరు సరఫరా జరుగుతుంది. అయితే రోలుగుంట శివాలయం సమీంలో రోలుగుంటలో గల పైపులైను లీకయి తాగు నీరు వృథాగా పోతుంది. వృథాగా పోతున్న తాగునీరు ఏకధాటిగా పోయి చెరువుని తలపిస్తుంది. దీని వల్ల బాధిత గ్రామాలకు తాగునీరు సరఫరా కాక స్థానికులు పడరాని పాట్లు పడుతున్నారు. అసలే వేసవికాలం. ఆపై బావుల్లో అడుగంటున్న జలాలు.. అధికారులు సమస్యను గుర్తించి పైపులైను లీకులను సత్వరమే సరిచేసి బాధిత గ్రామాలకు సజావుగా నీటికి సరఫరా చేయాలని ఆయా గ్రామాల వారు కోరుతున్నారు.

ప్రతి నీటిచుక్కను సద్వినియోగం చేసుకోవాలి



ఫారంపాండ్‌ను ప్రారంభిస్తున్న మండల ప్రత్యేకాధికారి నాగశిరీష, డ్వామా ప్రాజెక్టు అధికారి పూర్ణిమాదేవి

నాతవరం : ప్రతి నీటి చుక్కను వృథా కాకుండా కాపాడుకోవలసిన ఆవశ్యకత అందరిపై ఉందని మండల ప్రత్యేకాధికారి నాగ శిరీష, డ్వామా ప్రాజెక్టు డైరెక్టరు పూర్ణిమాదేవి అన్నారు. మండలంలో మర్రిపాలెం పంచాయతీలో శనివారం ప్రపంచ జల సంరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన ఫారంపాండ్‌ను ప్రారంభించి అక్కడ మొక్కలు నాటారు. ప్రాజెక్టు డైరెక్టరు మాట్లాడుతూ నీటిని వృధాగా చేయకుండా బాధ్యతగా వాడుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం నిధులతో రైతులు అభీష్టం మేరకు ఫారంపాండ్‌లు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు చైర్మన్ కె.సత్యనారాయణ, మండల టీడీపీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, పెద్ద చెరువు నీటి సంఘం అధ్యక్షుడు రంభా రాంబాబు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మంకు సాంబమూర్తి, ఏపీవో చిన్నారావు పాల్గొన్నారు.

25న వీరాంజనేయ స్వామి తీర్థం

మాడుగుల రూరల్ : మండలంలో ఎం.కోటపాడు, వల్లాపురం గ్రామ ఆరాధ్య దైవం అయిన వీరాంజనేయ స్వామి తీర్థం ఈ నెల 25వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనల తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ఎడ్ల పరుగు పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు ప్రథమ బహుమతి రూ. 15వేలు, ద్వితీయ రూ.12వేలు, తృతీయ రూ.10వేలు చొప్పున...అలాగే మరిన్ని స్థానాల్లోనూ రూ.8 వేల నుంచి రూ.1000 వరకూ నగదు బహుమతులు అందిస్తామన్నారు. క్రికెట్ క్రీడాకారులు, యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీ2025 పేరిట క్రికెట్ పోటీలు అదే రోజు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి రూ.25వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులు అందివ్వనున్నట్టు తెలిపారు.

‘నాగులపల్లి’ సేవలు శ్లాఘనీయం



రాజాం గ్రామంలో నాగులాపల్లి సత్యనారాయణ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

బుచ్చెయ్యపేట: వామపక్ష ఉద్యమ నాయకుడు నాగులాపల్లి సత్యనారాయణ సేవలు శ్లాఘనీయమైనవని స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు పేర్కొన్నారు. ఇటీవల మృతి చెందిన సత్యనారాయణ సంతాప సభ, ఆయన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం రాజాం గ్రామంలో శనివారం నిర్వహించారు. ఈ సంతాప సభలో జిల్లా ‘దేశం’ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొల్లిమెల్ల అచ్చింనాయుడు, కోవెల జనార్దనరావుతో పాటు కాంగ్రెసు, సీపీఎం, సీపీఐ ఇతర పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు, రైతు సంఘాలు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు నివాళులు అర్పించారు. నాలుగు దశాబ్దాల పాటు జిల్లాలో ఏజెన్సీ మైదాన ప్రాంతాల్లో వ్యవసాయ కూలీ కార్మిక ఉద్యమాల్లో ఆయన కృషి చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. రాజాం సర్పంచ్‌గా గ్రామాభివృద్ధి కోసం విశేష సేవలందించారని అన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



శివాలయంలో వేంకటేశ్వస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

నాతవరం : పురాతన శివాలయంలో శనివారం శ్రీ వేంకటేశ్వస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. మండలంలో వి.బి.అగ్రహారం గ్రామంలో 750 ఏళ్ల క్రితం శివలింగాన్ని ప్రతిష్ఠించారు. శ్రీపార్వతి రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 15వ తేదీ నుంచి వేదపండితులు ఏడిద బ్రహ్మలింగస్వామి నాగేశ్వరరావు చంద్రమౌళి ప్రభాకర సత్యనారాయణ శర్మలు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 26వ తేదీ వరకు పలు పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రూ.2 లక్షలతో కళావేదిక ఏర్పాటు పనులు



రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న కళావేదిక నిర్మాణ పనులు

రోలుగుంట : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో దాతల సాయంతో పూర్వ హెచ్‌ఎం సిహెచ్.అప్పలస్వామి ఆధ్వర్యంలో కళావేదిక నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ పాఠశాలలో 2001 నుంచి 2007 వరకూ సిహెచ్.అప్పలస్వామి హెచ్‌ఎంగా పాఠశాల అభివృద్ధికి కృషి చేశారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల ఫలితాల సాధన పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించేవారు. తరువాత వేములపూడి బదిలీ అయ్యారు. ఆ సమయంలో ఇక్కడ పాఠశాలలో కళావేదిక ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఉద్యోగ విరమణ అనంతరం పూర్వ విద్యార్థులతో సమావేశాలు నిర్వహించి అందరి ఆమోదంతో సమష్టిగా కళావేదిక నిర్మించాలని ప్రతిపాదించారు. పూర్వ విద్యార్థులతో పాటు నాటి ఉపాధ్యాయుల సౌజన్యంతో నిధులు సేకరించి ఈ నెల మొదటి వారంలో కళావేదిక నిర్మాణ పనులు చేపట్టారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే నిర్మాణం పూర్తి చేసి పాఠశాలకు కళావేదిక అందుబాటులోకి తేనున్నట్టు విలేకరులకు తెలిపారు.

‘వీఆర్పీపై తప్పుడు ఫిర్యాదులు తగవు’

నాతవరం : తప్పుడు ఫిర్యాదుతో ఫీల్డ్ అసిస్టెంటు (వీఆర్పీని) ఇబ్బంది పెట్టే విధంగా కూటమి నేతలు ప్రయత్నించడం సరి కాదని, వాస్తవాలు పరిశీలించాలని డ్వామా పీడీ పూర్ణిమాదేవి దృష్టికి వైస్ ఎంపీపీ పైల సునీల్ , సర్పంచ్ బొడ్డు సత్యనారాయణ తీసుకెళ్లారు. గన్నవరం పంచాయతీలో సామాజిక తనిఖీలు చేసే బృందం వచ్చినప్పుడు కొందరు తప్పుడు ఫిర్యాదు చేశారన్నారు. ఆరుగురు పేర్లు తప్పుడు మస్తర్లు వేసినట్టుగా కావాలని వీఆర్పీపై ఫిర్యాదు చేశారన్నారు. క్షేత్రస్థాయిలో సక్రమంగా పరిశీలిస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు. ముందు ఆరుగురికి తప్పుడు మస్తర్లుగా వేశారని ఫిర్యాదు చేసి, సభలో ఇద్దరే అంటూ చూపించారని అన్నారు. ఇద్దరిలో ఒకరు సభ వద్దకు వచ్చి తాను ఉపాధి హామీ పథకంలో పనికి వెళ్లానని చెప్పారని, దీని బట్టే తప్పుడు ఫిర్యాదులని స్పష్టమవుతుందని వాస్తవాలు పరిశీలించాలని అన్నారు. దీంతో సభలో కూటమి నేతలు, వైస్ ఎంపీపీ, సర్పంచ్‌ల నడుమ వాదులాట జరిగింది. పీడీ కలుగజేసుకుని వాస్తవాలు పరిశీలించి నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారు.

హోమియో మాత్రలు పంపిణీ

మాడుగుల రూరల్ : కలుషిత నీటిని తాగడం వల్ల ఎంతో మంది అనారోగ్యానికి గురవుతున్నారని, వద్దాది అతిథి దేవోభవ స్వచ్ఛందసేవా సంస్థ కార్యదర్శి ఆరిపాక కామేశ్వరావు అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ముకుందపురం ఎంపీపీ పాఠశాలలో శనివారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛమైన నీటిని తాగడం వల్ల ఎటువంటి అనారోగ్యాలు దరి చేరవన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వడదెబ్బకు గురికాకుండా హోమియో మాత్రలు అందజేశారు.

మండల సమావేశంలో భూసమస్యలపై ధ్వజం



భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్న సర్పంచ్ కన్నయ్యనాయుడు

నర్సీపట్నం : మండల పరిషత్ సమావేశంలో భూ సమస్యలపై ప్రజాప్రతినిధులు గళమెత్తారు. ఎంపీపీ సుర్ల రాజేశ్వరి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తాము ముగ్గురు అన్నదమ్ములం..మాకు ఉన్న భూమిని ముగ్గురికీ కాకుండా రీ సర్వేలో రెవెన్యూ సిబ్బంది ఆరుగురికి పంపిణీ చేశారని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, ధర్మసాగరం సర్పంచ్ గొంప కన్నయ్యనాయుడు డీటీని ప్రశ్నించారు. తమకు సంబంధం లేని ముగ్గురు వ్యక్తులకు మా భూమిని ఎలా పంచుతారని నిలదీశారు. అధికార పార్టీకి చెందిన జెడ్పీటీసీ సుకల రమణమ్మ రెవెన్యూ సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. తనకు సంబంధించిన 82 సెంట్ల జిరాయితీ భూమి రీసర్వే చేసిన తర్వాత 69 సెంట్లు చూపిస్తుందని, మిగిలిన భూమి ఏమైందని డీటీ నరేంద్రను వివరణ కోరారు. జిరాయితీ భూములను ఈనాం భూములుగా చూపించడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ విషయాలను తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లి పొరపాట్లు జరగకుండా చూస్తానని డీటీ నరేంద్ర బదులిచ్చారు. ఖరీఫ్ సీజన్‌కు ముందే జీలుగ, జనుము విత్తనాలు రప్పించాలని ఎంపీటీసీ రాంప్రసాద్ ఏవో అప్పారావుకు సూచించారు. సమావేశంలో వైస్ఎంపీపీలు తాతబాబు, ఇన్నం రత్నం, ఎంపీడీవో ఉషాశ్రీ, సూపరింటెండెంట్ రమణబాబు పాల్గొన్నారు.

ఉన్నత విద్య ద్వారానే మహిళాభివృద్ధి



మాట్లాడుతున్న నవజీవన స్రవంతి డైరెక్టర్ సజిత

మాడుగుల : ఉన్నత విద్య ద్వారానే మహిళాభివృద్ధి సాధ్యమవుతుందని, ఆర్‌సీఎం నవజీవన స్రవంతి మహిళా సంఘం డైరెక్టర్ సిస్టర్ సజిత అన్నారు. శనివారం స్థానిక సెయింటాన్స్ నవజీవన స్రవంతి సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడం కోసం సెయింటాన్స్ నవజీవన స్రవంతి నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్. శ్రీదేవి మాట్లాడుతూ బాల్యం నుంచి మంచి పౌష్టికాహారం అందిస్తే ప్రతి మహిళ అన్ని రంగాల్లో ప్రతిభ కనబరుస్తుందన్నారు. ఐసీడీఎస్ లాంటి సంస్థల ద్వారా బాల్యవివాహాలు అరికట్టడం జరిగిందన్నారు. మహిళల రక్షణ కోసం ఇంకా కఠిన చట్టాలు రావాల్సి ఉందన్నారు. సెయింట్ అన్స్ సుపీరియర్ సిస్టర్ సలీన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మహిళావిద్య కోసం ఎంతో పాటు పడ్డారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు మహిళా సంఘ సభ్యులు, బోర్డు డైరెక్టర్లు పాల్గొన్నారు.

క్షయ రోగులకు ఉచితంగా మందులు



ఎ.కోడూరులో క్షయవ్యాధిపై ర్యాలీ



మాకవరపాలెంలో మానవహారం

కె.కోటపాడు : రెండు వారాలకు మించి దగ్గు సమస్య ఉంటే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించి క్షయ నిర్ధారణ పరీక్ష చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ తెలిపారు. క్షయ వ్యాధిపై ఎ.కోడూరు గ్రామస్తులకు శనివారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ క్షయ వ్యాధి సోకిన వారికి రెండు వారాలకు పైగా దగ్గుతో పాటు బరువు తగ్గడం, కఫంతో కూడిన దగ్గు, జ్వరం వస్తుంటుందని ఆమె తెలిపారు. క్షయ వ్యాధి సోకిన వారికి చికిత్సా కాలంలో ప్రతి నెలా రూ.500 నగదు పౌష్టికాహారం కోసం అందించడం జరుగుతుందని తెలిపారు.

మాకవరపాలెం : అవగాహనతోనే క్షయ వ్యాధిని నివారించవచ్చని వైద్యాధికారి ధీరజ్ అన్నారు. టీబీ వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యార్థులు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులు ప్లకార్డులతో నినాదాలు చేశారు.

గొలుగొండ : క్షయవ్యాధి పట్ల నిర్లక్ష్యం చేయకుండా ముందుగానే పరీక్షలు చేయించుకొని వ్యాధి బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ గొలుగొండ పీహెచ్‌సీ పరిధిలో శనివారం ర్యాలీ నిర్వహించారు. గొలుగొండ పీహెచ్‌సీ నుండి ప్రధాన రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, హెల్త్ సూపర్‌వైజర్ ఫకీర్‌నాయుడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

కోఆప్షన్ సభ్యుడికి అమర్‌నాథ్ పరామర్శ



రెహమాన్‌ను పరామర్శించిన అమర్‌నాథ్

చోడవరం : అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మీపురం వైఎస్సార్‌సీపీ నాయకుడు, మండల పరిషత్ కోఆప్షన్ ఎంపీటీసీ సభ్యుడు షేక్ రెహమాన్‌ను ఆ పార్టీ సమన్వయకర్త, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శనివారం పరామర్శించారు. విశాఖపట్నం ప్రైవేటు ఆస్పత్రిలో రెహమాన్ చికిత్స పొందుతుండడంతో అక్కడకు పార్టీ నాయకులతో కలిసి వెళ్లి అమర్‌నాథ్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకొని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి వర్గాలను అమర్‌నాథ్ కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, గాడి అప్పారావు, లక్ష్మీపురం సర్పంచ్ గణపతినాయుడు పాల్గొన్నారు.

భవిత కేంద్రానికి అభ్యసన సామగ్రి

మాకవరపాలెం : భవిత కేంద్రానికి బోధనా అభ్యసన సమాగ్రి సమకూరిందని ఎంఈవో మూర్తి తెలిపారు. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ సీఎస్ఆర్ నిధుల నుంచి శనివారం మండల కేంద్రంలో ఉన్న భవిత కేంద్రానికి సమగ్రి అందిందని ఆయన తెలిపారు. వీటిలో స్పీచ్ ట్రైనర్, చైర్స్, ఫిజియోథెరపీ సామగ్రి, టేబుల్స్‌ను అందించారన్నారు.

31 వరకూ గాలికుంటు టీకాల కార్యక్రమం

కె.కోటపాడు : గాలికుంటు వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు 3 నెలలు దాటిన ఆవులు, గేదెలకు పాడి రైతులు తప్పక టీకాలు వేయించాలని కొరువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు అన్నారు. కొరువాడ, డి.అగ్రహారం, గవరపాలెం గ్రామాల్లో పశువైద్య సహాయకులు శనివారం నిర్వహిస్తున్న గాలికుంటు టీకాలను వేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొరువాడ పశువైద్య కేంద్రం పరిధిలో గల గ్రామాల్లో 5500 ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేయాలని లక్ష్యం పెట్టుకోగా ప్రస్తుతానికి 4200 పశువులకు వేసినట్టు తెలిపారు. ఈ నెలాఖరువరకూ టీకాల కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. టీకాలను ఆరు నెలలు దాడిన చూడి పశువులకు వేయరాదని ఆయన సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు లింగేశ్వరరావు, దేముడు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్ అయిన గొర్లె యర్రమ్మ W/o యరకయ్య అక్కయ్యపాలెం యిచ్చిన బోగట్టా ప్రకారం ఈ క్రింది షెడ్యూలు గల ఆస్తిని పెదబొడ్డేపల్లికి చెందిన రెడ్డి నారాయణమ్మ మరియు కొంతమంది అమ్మడానికి ప్రయత్నం చెయ్యగా నర్సీపట్నంలో గల శ్రీ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో దావా దాఖలు చెయ్యగా ప్రస్తుతం OS 344/2022గా పెండింగ్‌లో ఉంది. ఈ ఆస్తిపై ఎటువంటి క్రయ, విక్రయాలు ఎవరికీ చెల్లనేరవు.

షెడ్యూలు

అనకాపల్లి జిల్లా, నర్సీపట్నం సబ్-రిజిస్ట్రార్ ఆఫీసు పెదబొడ్డేపల్లి గ్రామములో గల RCC స్లాబు ఇల్లు, S.No. 320, D.No. S-114, Assessment No. 1136008130, Extent 0.05 సెంట్లు గల స్లాబు ఇల్లుకు హద్దులు **తూర్పు:** R&B రోడ్డు, **పడమర:** నా యొక్క ఉమ్మడి ఇల్లు, **ఉత్తరం:** R & B రోడ్డు, **దక్షిణం:** బండారు పాత్రుడు గారి ఇల్లు

MAKIREDDI BULLI DORA, LLB
Advocate
Pedaboddepalli (V), Narsipatnam(Md), Anakapalli (Dt), Ph: 98495 33986

సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలి

నాతవరం : ప్రశాంతమైన వాతావరణంలో పరిష్కరించుకునే స్వల్ప విషయాలు పోలీసుస్టేషన్లు, కోర్టులను ఆశ్రయిస్తే ఇరువురు ఆర్థికంగా ఇబ్బందులు పడతారని మండల ప్రత్యేకాధికారి నాగశిరీష అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పీజీఆర్ఎస్ ఫిర్యాదుదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కలెక్టరు ఆదేశాల ప్రకారం క్షేత్ర స్థాయిలో ఫిర్యాదులు పరిశీలించి న్యాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు. అంతవరకు వివాదాలు పెంచుకోరాదని హితవు పలికారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్ , ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పార్థసారథి పాల్గొన్నారు.

27న మాడుగుల ఎంపీపీ ఎన్నిక

మాడుగుల రూరల్ : స్థానిక మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక ఈ నెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కొంకి అప్పారావు శనివారం తెలిపారు. గత ఏడాది జనవరి 22న అప్పటి ఎంపీపీ వేమవరపు రామధర్మజ వ్యక్తిగత కారణాల దృష్ట్యా ఎంపీపీ పదవికి రాజీనామా చేశారు. అప్పట్లో ఎన్నికల కోడ్ నేపథ్యంలో జె.డి.పేట ఎంపీటీసీ, నాటి వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ తాత్కాలిక ఎంపీపీగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి అయిన జిల్లా కలెక్టర్ తాజాగా ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేశారని, దీంతో ఎంపీటీసీ సభ్యులకు ఫారం- 5 ద్వారా నోటీసులు అందజేసినట్టు ఎంపీడీవో తెలిపారు. ఈ నెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు ఎంపీటీసీ సభ్యులు మండల పరిషత్ కార్యాలయానికి విధిగా హాజరు కావాలన్నారు. జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి కె. వీరంనాయుడును ఎన్నికల అధికారిగా నియమించారన్నారు.

మాకవరపాలెం ఎంపీపీ ఎన్నికకు పీవోగా రామ్మోహన్‌రావు

మాకవరపాలెం : ఈ నెల 27న జరగనున్న ఎంపీపీ ఎన్నికకు ప్రిసైడింగ్ అధికారిగా జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రామ్మోహన్‌రావును నియమించినట్టు ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. ఈ ఎన్నికకు 23న నోటిఫికేషన్ జారీ చేస్తామని, 27న ఉదయం 11 గంటలకు ఎంపీపీ ఎన్నిక నిర్వహిస్తామన్నారు.

ప్రిసైడింగ్ అధికారిగా మంజులవాణి

దేవరాపల్లి : ఈ నెల 27న జరిగే ఎంపీపీ ఎన్నిక ప్రక్రియకు ప్రిసైడింగ్ అధికారిగా డీఎల్‌డీవో, మండల ప్రత్యేక అధికారి ఎస్.మంజులవాణిని నియమితులయ్యారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. 27న మధ్యాహ్నం ఒంటి గంట లోపు నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉప సంహరణ ప్రక్రియ జరుగుతుందన్నారు. అనంతరం ఎంపీపీ ఎన్నిక నిర్వహించి, వెంటనే ఫలితాన్ని ప్రకటిస్తామన్నారు.

గాయపడ్డ ముషిడిపల్లి ఎంపీటీసీకి పరామర్శ

దేవరాపల్లి : ప్రమాదవశాత్తూ జారి పడి తీవ్రంగా గాయపడిన ముషిడిపల్లి ఎంపీటీసీ బొడ్డు లక్ష్మీని స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు తదితర సర్పంచ్‌లు, ఎంపీటీసీలు శనివారం పరామర్శించారు. పొలంలో జారిపడడంతో కాలికి తీవ్రగాయం కావడంతో ఆస్పత్రిలో ఆపరేషన్ అనంతరం ఇంటికి చేరుకున్నారు. ఆమెను పరామర్శించిన నేతలు ప్రమాదం జరిగిన తీరును, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎంపీటీసీని పరామర్శించిన వారిలో ఎ.కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, మామిడిపల్లి, ఎం.అలమండ, చింతలపూడి ఎంపీటీసీలు సింహాచలంనాయుడు, వెంకటరావు, గౌరమ్మ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వంటాకు శ్రీను, రాంబాబు, మహేష్, బొడ్డు అప్పారావు ఉన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం, కె.జె.పురం, వి.మాడుగుల మండలం

రేఖా నెం.05/2025 తేది: 22-03-2025 ది

టెండర్లు మరియు బహిరంగ వేలముల ప్రకటనలు

అనకాపల్లి జిల్లా, వి.మాడుగుల మండలం, కె. జె.పురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ దిగువ తెలిపిన **షెడ్యూల్ :1** నందు గల గుత్తలకు 2025-2026 కె.జె.పురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద తే:26-03-2025 ది. అనగా ఉదయం 11:00 గం॥ లకు బహిరంగ వేలములు నిర్వహించబడును. సదరు పాటదార్లు గ్రామ పంచాయతీకి ఎటువంటి బకాయిలు ఉండరాదు. బకాయిలు ఉన్నచో పాటదార్లు వేలం పాట పాడుటకు అనర్హులు. గ్రామ పంచాయతీకి ఉన్న బకాయిలు మొత్తము పూర్తిగా చెల్లించి వేలం పాటలో పాల్గొనవలెను. గ్రామ పంచాయతీ ఈ దిగువ తెలిపిన ధరావత్తు సొమ్మును పాట పాడుటకు ముందుగానే చెల్లించవలెను.

షెడ్యూల్: 2 నందు కాంట్రాక్టు పద్ధతి ద్వారా 2025-2026 సం॥నకు గాను గ్రామ పంచాయతీలో ఈ దిగువ సుదహరించిన పనులు చేయుటకు సీల్డ్ కవర్ ద్వారా టెండర్ వేయుటకుగాను తే:26-03-2025ది. అనగా మధ్యాహ్నం 2:00 నుండి 3:00 వరకు టెండర్లు ఈ క్రింది సంతకం దారునిచే స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లు అదే రోజు అనగా 26 -03-2025 మధ్యాహ్నం 4:00 గం॥ లకు హాజరైన టెండర్ల దారుల సమక్షమున తెరవబడును. దాఖలైన టెండర్లు కారణం తెలపకనే ఆమోదించుటకు (లేదా) తిరస్కరించుటకు గ్రామ పంచాయతీకి అధికారం కలదు.

షెడ్యూల్ :1

వరుస సంఖ్య	వేలముల వివరములు	ధరావత్తు
1	2025-2026 ఆర్థిక సం॥ లో రోజు వారి మార్కెట్లో ఆశీలు వసూలు చేసుకొను హక్కునకుగాను,	5000/-
2	2025-2026 ఆర్థిక సం॥ లో షాపింగ్ కాంప్లెక్స్‌లో షాప్ అద్దెలు వసూలు చేసుకొను హక్కునకుగాను,	2000/-
3	2025-2026 ఆర్థిక సం॥ లో గాలివాన చెరువులో చేపలు వేసి పెంచి పట్టుకొని అమ్ముకొనుట హక్కునకుగాను	5000/-

షెడ్యూల్ :2

వరుస సంఖ్య	టెండర్లు వివరములు	ధరావత్తు
1	2025-2026 ఆర్థిక సం॥ లో గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు కాంట్రాక్ట్ పద్ధతి ద్వారా(మనిషి ఒక్కంటికి) 4 (నలుగురిని) నష్లయి చేయుటకు	1000/-
2	2025-2026 ఆర్థిక సం॥ లో గ్రామ పంచాయతీ పరిధిలో మంచినీటి సరఫరా (ఆన్-ఆఫ్) మరియు రిపైర్లు చేయుటకు కాంట్రాక్ట్ పద్ధతి ద్వారా(మనిషి ఒక్కంటికి) ఒకరిని నష్లయి చేయుటకు	500/-
3	2025-2026 ఆర్థిక సం॥ లో గ్రామ పంచాయతీ పరిధిలో వీధి లైట్లు నిర్వహణ, స్విచ్ బోర్డులు ఆన్ & ఆఫ్ మరియు రిపైర్లు చేయుటకు కాంట్రాక్ట్ పద్ధతి ద్వారా(మనిషి ఒక్కంటికి) ఒకరిని నష్లయి చేయుటకు	500/-

షరతులు: 1. పాట కాయపరచుకున్న పాటదారుడు పంచాయతీ నియమ నిబంధనలకు లోబడి కాయపరచుకున్న మొత్తములో గ్రామ పంచాయతీకి 50% చెల్లించి మార్కెట్లోకి వసూళ్లుకు వెళ్లవలెను.
2. మిగిలిన 50% మొత్తము రెండు దఫాలుగా మూడు నెలలలో గ్రామ పంచాయతీకి చెల్లించవలెను.
3. పాట కాయపరచుకున్న వ్యక్తి పై తెలిపిన నియమాలకు లోబడి గ్రామ పంచాయతీకి సహకరించవలెను.

సం/- **బి.నవీన్ వంశీ దొర,** పంచాయతీ కార్యదర్శి,
కె.జె.పురం గ్రామ పంచాయతీ, వి.మాడుగుల మండలం, అనకాపల్లి జిల్లా